పోరాట వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్

గద్వాల న్యూటౌన్, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): బడుగుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఐడీవోసీ అవరణలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, అధికారులు ఉన్నారు.

అగ్గువ..


నాగర్‌కర్నూల్: ఎండబెట్ల కేసరి సముద్రం వద్ద గాలం వేస్తున్న స్థానికులు

- రూ.50లకే కిలో చేపలు
- పనులు లేక చేపల వేటకు వెళ్తున్న కూలీలు
- 10 నుంచి 20కిలోల వరకు దొరుకుతున్న చేపలు
- గాలాలు వేస్తూ ఎంజాయ్ చేస్తున్న యువకులు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా వ్యవసాయ పనులు నిలిచిపోవడంతో కూలీలు చేపల వేటకు వెళ్తున్నారు. జిల్లాలోని చెరువులు, కుంటలు భారీగా అలుగు పారుతుండడంతో చేపల వేట జోరుగా సాగుతోంది. యువకులు గాలాలు వేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

పనులు లేక చేపల వేట..

పది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో వ్యవసాయ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పత్తి చేనులో కలుపు తీయడం, వరి నాట్లు వేసే ప్రక్రియ కూడా ముందుకు సాగకపోవడంతో వ్యవసాయ కూలీలు చెరువుల్లో చేప వేటకు వెళ్తున్నారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో 158 చెరువులు, 1,358 కుంటలు అలుగులు పారుతున్నాయి. దీంతో ఇతరత్రా పనులు లేకపోవడం కారణంగా చేపల వేటకు వెళ్తున్నారు. వడ్డేమాన్‌లోని భీమా సముద్రం, పాలెం పెంటోని చెరువు, నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం, నాగనూల్ నాగ సముద్రం పొంగి ప్రవహిస్తుండడంతో చేపలు చాలా సులువుగా చిక్కుకుతున్నాయి. రవుట, బొచ్చె, నల్లబొచ్చెలు ఒక్కొక్కరు 10 నుంచి 20కేజీల వరకు పట్టుకుంటున్నారు. మామూలు రోజుల్లో కిలో రూ.150 నుంచి రూ.200 వరకు ధర పలుకుతుండగా ప్రస్తుతం రూ.40 నుంచి రూ.50లకు విక్రయిస్తుండడం గమనార్హం. చేపలు ఇష్టంగా తినేవారు కూడా చెరువులు, కుంటల వద్ద బతికిన చేపలు దొరుకుతుండడంతో అక్కడికి వెళ్లి తెచ్చుకుంటున్నారు. వానకాలం సీజన్‌లో చిన్న జల్లెలు, పరకలకు కూడా బాగా డిమాండ్ ఉంటుంది. ఈ క్రమంలో వాగులు, వంకల వద్ద చీరలు, పంచెలతో చేపలు పడుతున్నారు. ఈ చేపలకు బాగా డిమాండ్ ఉండడంతో వ్యవసాయ కూలీలంతా ఆ పనిలో నిమగ్నమయ్యారు.

నష్టాల్లో పత్తి రైతు

- ఒక వైపు ముసురు.. మరో వైపు ఎర్రనల్లి..
- వైరస్ దాడితో కకావికలం
- గద్వాల జిల్లాలో 1.50లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు


మానవపాడు:కొర్విపాడు స్టేజీ వద్ద ఎర్రనల్లి ఆశించడంతో పాలిపోయిన పంట

అలంపూరుచౌరస్తా, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు పత్తిరైతులను నట్టేట ముంచుతున్నాయి. ఓ వైపు ముసురు.. మరో వైపు ఎర్రనల్లి దాడితో పత్తి రైతులు కోలుకోలేకపోతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో సుమారు 1.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చాలా మంది రైతులు మే చివరి వారం నుంచే సాగు ప్రారంభించారు. ఈ నెలలో కురుస్తున్న వర్షాలకు పత్తి మొక్కలు పూతకాత లేక మోడుబారి దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు ఎర్రనల్లి దాడి మొదలైంది. వెరసి రైతులకు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30వేల దాక నష్టం వచ్చే ఆవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

ఏడిపిస్తున్న ఎర్రనల్లి

గతేడాది పత్తి సాగు చేసిన రైతులు లాభాలు గడించారు. ఈ ఏడాది కూడా లాభాలు వస్తాయని ఆశించిన రైతులు పత్తిని అధిక విస్తీర్ణంలో సాగుచేశారు. జిల్లాలో సుమారు 1.50లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోడు ఎర్రనల్లి ఆశించడంతో పూత, పిందె, కాయ రాలిపోతోంది. సస్యరక్షణ చర్యలు చేపట్టినా ముసురు వర్షాలకు ఉండదని రైతులు వాపోతున్నారు. తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టకపోతే దిగుబడి తగ్గి పెట్టుబడి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎం చేయాలో అర్థం కావడం లేదు



గతేడాది పొగాకు సాగుచేస్తే కొనుగోలు చేసేవారు లేక అప్పులపాలయ్యాం. పత్తి సాగు చేసిన రైతులు లాభాలు పొందారు. ఈ ఏడాది కూడా పత్తి సాగులో లాభాలు వస్తాయని పది ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. పిందె పట్టకముందే పంటలు దెబ్బతింటున్నాయి. ఎం చేయాలో అర్థం కావడం లేదు.

- వాల్మీకి మద్దిలేటి, మానవపాడు

నివారణ చర్యలు చేపట్టాలి



పత్తి రైతులు ప్రస్తుతం గడ్డుకాలాన్ని ఎదుర్కుంటున్నారు. ముసురు వానల వల్ల నిలిచిన నీటిని బయటకు పంపాలి. 13-0-45 పౌడర్‌ను నీళ్లలో కలిపి పత్తిపంటపై పిచికారీ చేయాలి. ఎర్రనల్లి పత్తి పంటను తీవ్రంగా దెబ్బతిస్తోంది. దీని నివారణకు ఒక లీటరు నీటికి 1ఎంఎల్ స్పిరోమెస్పిన్ అనే మందును కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

- అనిత, ఉండవల్లి వ్యవసాయ అధికారి


సరళాసాగర్ 5 గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

తెరుచుకున్న సరళాసాగర్ 5 గేట్లు

మదనాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని సరళాసాగర్ ప్రాజెక్టు ఆటోమెటిక్ సైఫన్లు సోమవారం 5 తెరుచుకున్నాయి. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద రావడంతో 5 గేట్ల నుంచి సుమారు 6వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల అవుతున్నాయి. దీంతో ఆత్మకూర్, వనపర్తి రహదారిపై ఉన్న కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇలా అయిదు రోజులుగా రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే రామన్‌పాడు ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి పదివేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ ప్రమోద్ తెలిపారు.

టేస్ట్ అదిరింది..

- డిండి ప్రాజెక్టువద్ద నోరూరించే చేపల వంటకాలు
- ఫైకోసం బారులు తీరుతున్న ఆహార ప్రియులు
- ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాలు
- దుందుభీ ప్రవాహాన్ని ఆస్వాదిస్తూ.. చేపల వంటలు రుచి చూస్తున్న పర్యాటకులు


ఫ్రై చేసేందుకు సిద్ధంగా ఉంచిన చేపలు

అచ్చంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నాగర్‌కర్నూల్ జిల్లాలోని వాగులు, వంకలు, ప్రాజెక్టుల వద్ద జలసవ్వడులు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ఈ నెల 15 నుంచి డిండిప్రాజెక్టు మత్తడి దూకుతోంది. ఈ ప్రాజెక్టు శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉండడంతో శ్రీశైలం వెళ్లి వచ్చే భక్తులు ప్రాజెక్టు అందాలను తిలకిస్తున్నారు. చల్లటి వాతావరణంలో ప్రాజెక్టు సమీపంలో గుమగుమలాడే చేపలఫ్రై, కర్రీ వంటలు పర్యాటకుల నోరూరిస్తున్నాయి. ఇటు జల సవ్వడులు, అటు చేప వంటల రుచులు చూస్తూ పర్యాటకులు ఎంజాయ్ చేస్తున్నారు.


ఫ్రై చేస్తున్న వ్యాపారి


డిండి వద్ద చేపల దుకాణాలు

మదిని దోచే.. దృశ్య రూపం

● నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


వనపర్తి : పామాపురంలో ఉన్న ఊకశెట్టి చెక్‌డ్యాం వద్ద చేపలకు వల విసురుతున్న మత్స్యకారుడు 6

వర్షాలకు కూలిన ఇళ్లు


జోగులాంబ గద్వాల జిల్లా
ఇటిక్యాల మండలంలోని సాతర్లలో కూలిన మట్టి మిద్దె 7

భారీ వర్షాలకు రాకపోకలు బంద్

- కాజ్‌వేలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

కందనూలు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తోంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి నాగర్‌కర్నూల్ మండలంలోని నాగనోల్, ఎండబెట్ల, నల్లవెల్లి, తూడుకుర్తి గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. కేసరి సముద్రం అలుగు పారుతుండడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి చెరువు కట్టకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లు కేసరి సముద్రం, నాగనూల్ చెరువులను పరిశీలించారు. నీటి ప్రవాహంలో ఎవరూ రోడ్డు దాటకుండా పోలీసులను బందోబస్తు ఉంచారు.


నాగనూల్‌కాజ్‌వేపై నీరు పారుతుండడంతో రాకపోకలు నిలిపివేస్తూ బారికేడ్లు, ముళ్లకంప వేసిన పోలీసులు

వృత్తి విద్యా కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

- అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్లు

వనపర్తి రాజీవ్ చౌరస్తా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రస్తుతం డిమాండు ఉన్న వృత్తి విద్యా కోర్సుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని అదనపు కలెక్టర్ కీమ్యానాయక్ తెలిపారు. సోమవారం ప్రజావాణి హాల్లో ఏటీసీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ) నెలకొల్పిందన్నారు. వనపర్తి జిల్లాలోని ఐటీఐ కళాశాలలో ఈ ఆధునిక వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశానికి ఆగస్టు 28 వరకు అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఐటీఐ ప్రిన్సిపాల్ రమేశ్ తదితరులు ఉన్నారు.

యూరియా పంపిణీ పకడ్బందీగా జరగాలి

- ఎస్పీతో కలిసి గోదాములను పరిశీలించిన కలెక్టర్

గద్వాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యూరియా నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పక్బందీగా రైతులకు పంపిణీ చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. సోమవారం గద్వాల పట్టణ సమీపంలోని కొండపల్లి రోడ్డులోని ప్రైవేటు గోదాములను ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. గోదాములలో ఉన్న రికార్డులను పరిశీలించి వాటికి అనుగుణంగా నిల్వలు ఉన్నాయా.. అని పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే పంపిణీ జరగాలని సూచించారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడకూడదని వారికి కావాల్సిన యూరియా అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. రైతులు కూడా తమ అవసరం మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసా య అధికారి సక్రియనాయక్, ఏడీఏ తదితరులు ఉన్నారు.


యూరియా నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ


అందం చూడవయా.. మహబూబ్‌నగర్ మయూరీ నర్సరీలో పెద్దసీమ కోళ్లు


వనపర్తి జిల్లా ఘణపురం మండలం షాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన ఉన్న కొట్టేసిన చెట్టుపై చిగురిస్తున్న ఆకులు


వనపర్తిలో 79వ స్వాతంత్ర్య వేడుకలలో జాతీయ జెండాలతో విద్యార్థులు


మదనాపురం మండలం పరిధిలోఉన్న సరళాసాగర్ ప్రాజెక్టు వద్ద ఆకాశంలో వరుస క్రమంలో పక్షులు


మదిని దోచే.. దృశ్య రూపం

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా..


వనపర్తి జిల్లా కేంద్రంలో ఆకట్టుకుంటున్న పువ్వులు


వనపర్తిలో చెట్టు కొమ్మ ఆకారంలో పురుగు


నీలాకాశంలో పాలమూరు అందమొలికె..


మహబూబ్‌నగర్ బైపాస్‌లో పాలకొండ చెరువు చుట్టూ ఎర్రని ఆకాశం


వేలిపై సూర్యుడి ప్రతిబింబం కిన్పించేలా...


వనపర్తిలోని ఓ ఇంటిలో సాలీడ్ గూడు


వనపర్తిలో రాత్రి వేళలో పున్నమి చందమామ


పామాపురంలో ఉన్న ఊకొట్టి చెక్‌డ్యాంలో శివుడి విగ్రహం వద్ద పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ



ఫొటో అంటే మాటలకు అందని ఎన్నో భావాలకు దృశ్యరూపం.. క్షణ కాలపు దృశ్యాన్ని శాశ్వతంగా మార్చే ఇంద్రజాలం. గత జ్ఞాపకాలను, వర్తమాన విన్యాసాలను భవిష్యత్తు తరాలకు అందించే బహుమానం.. భారత స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలర్పించిన మహానుభావులు, యోధుల చిత్రాలను, వారి ఉద్యమ రూపాలను నేటి తరానికి అందించినది ఈ ఫొటోలే.. ఫొటోగ్రఫీ సృజనాత్మకతకు అద్దం పట్టే అందమైన ప్రపంచం. ఎవరి ఇంట్లో చిన్న శుభకార్యం జరిగినా కెమెరాలలో ఫొటోలు, వీడియోలు చిత్రీకరించుకొని పదిల పరుచుకుంటారు. మరికొందరు ప్రకృతి సోయగాలను, అందమైన దృశ్యాలను తమ కెమెరాలలో బంధించి భద్రపరచుకుంటారు. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా.. 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటో గ్రాఫర్లు, విలేకరులు తీసిన అందమైన చిత్రాల సమాహారం...

- నారాయణపేట/ధరూర్/ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, వనపర్తి, మహబూబ్‌నగర్)


నారాయణపేట జిల్లా సరిహద్దులో మర్రిచెట్టుపై తాటి చెట్టు ఇలా...


వనపర్తి మండలం అచ్యుతాపురం శివారు ప్రాంతంలో నెమలి


హన్వాడ సమీపంలో చెట్టుపై కొంగల సమూహం


హన్వాడ మండలం టంకర పెద్ద చెరువులో తెల్లకొంగల విహారం


గద్వాలలో జూరాల డ్యాం వద్ద కనువిందు చేస్తున్న పుష్పం


వనపర్తి జిల్లాలో బుద్దారం గండి వద్ద చెక్ డ్యాం జలపాతం దృశ్యం

రాష్ట్ర స్థాయికి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు


రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కోస్గి రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 16న నిర్వహించిన వా లీబాల్ పోటీలలో గుండుమాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నీలిమ వర్ధిని తెలిపారు. రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 15 వాలీబాల్ పోటీలకు ఎంపికైన పల్లవి, మౌనిక, జగదీష్ విద్యార్థులను సోమవారం ఆమె అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి రాణించాల ని విద్యార్థులను ప్రోత్సహించారు. వైస్ ప్రిన్సిపాల్ రహీమ్, పీడీ సాధిక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు రిషి విద్యార్థి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 18,19వ తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని న్యూరిషి పాఠశాల విద్యార్థి గౌతమ్ ఎంపికయ్యాడు. ఈ నెల 16న జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావటం పట్ల న్యూరిషి సంస్థల చైర్మన్ చంద్రకళ, డైరెక్టర్లు పూజిత, శిరిష, ప్రవీణ్‌కుమార్, సాయిసుశాంత్, కృష్ణ, స్కూల్ ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రారంభమైన పీజీ, బీ ఫార్మసీ పరీక్షలు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూని వర్సిటీలో పీజీ నాల్గవ సెమిస్టర్, బీ ఫార్మసీ ఆరవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, పరిశీలకులు డాక్టర్ నూర్జహన్‌తో కలిసి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. పరీక్ష ప్రారంభమైన అరగంట తర్వాత ఆబ్సెంటీస్, ప్రజెంటీస్‌ను ఆ న్‌లైన్‌లో పొందుపరచాలని, క్వశ్చన్ పేపర్‌లో సిలబస్ ప్రకారంగా క్వశ్చన్స్ వచ్చాయో లేదో సరిచూసుకోవాలని అన్నారు. పీజి నాల్గవ సెమిస్టర్ పరీక్షలకు 767 మంది విద్యార్థులకు గాను 749 మంది హాజరయ్యారని, బీ ఫార్మసీ ఆరవ సెమిస్టర్ పరీక్షలకు 193 మంది విద్యార్థులకు గాను 188 మంది హాజరయ్యారని తెలిపారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం

- వందలాదిగా తరలివచ్చిన భక్తులు
- గుట్టపై మారుమోగిన శివనామం
- వర్షాన్ని సైతం లెక్కచేయక స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

ఊట్కూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పులిమామిడి గ్రామంలోని గుట్టపై వెలసిన శ్రీరామ లింగేశ్వర స్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం వందలాది భక్తుల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. శివనామాన్ని జపిస్తూ భక్తులు స్వామి వారి రథాన్ని ముందుకు లాగారు. స్వామి రథోత్సవాన్ని చూడటానికి వందలాదిగా భక్తులు తరలిరావడంతో రామ లింగేశ్వరుడి గుట్ట భక్తులతో కిటకిటలాడింది. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద అగ్ని గుండం కార్యక్రమం నిర్వహించారు. ఈ అగ్నిగుండం సందర్భంగా శివ నామస్మరణంతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. గత మూడు రోజులుగా వర్షం కురుస్తున్నా అవేవి పట్టించుకోకుండా భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి జాతర సందర్భంగా బంధువుల రాకతో గ్రామం అంతా సందడిగా మారింది. ఈ రథోత్సవంలో మండల మాజీ ఉపాధ్యక్షుడు ఎల్లాగౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ సూరయ్యగౌడ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్ర ముఖులు, పులిమామిడి, ఊట్కూర్, ఎడవెల్లి, చిన్న పొర్ల, పెద్దపొర్ల, బిజ్వార్, జక్లేర్, మగ్దుం పూర్, కొత్తపల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


గుట్టపై స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు

ట్రిపుల్ ఐటీ పాలమూరుకు తలమానికం

- మహబూబ్‌నగర్ విద్యార్థుల చిరకాల స్వప్నం సహకారం
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- తాత్కాలిక భవనంలో ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మానసపుత్రిక ఐఐఐటీ కళాశాల అని ట్రిపుల్ ఐటీ పాలమూరుకు తలమానికం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బండమీదపల్లిలో గల రెడ్డి హాస్టల్‌లో తాత్కాలింగా ఏర్పాటు చేసిన ఐఐఐటీ కళాశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పదవ తరగతిలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా 210 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌లో ఐఐఐటీ కళాశాల తరగతులు ఈ నెల 22న ఓరియంటేషన్ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఇందుకు గాను యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, టీచింగ్ సిబ్బంది నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం రెగ్యులర్ తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. ఇక్కడ ఇది తాత్కాలిక భవనమే అయినప్పటికీ విద్యార్థులకు హాస్టల్ యాజమాన్యం అన్ని వసుతులు ఉంటాయని తెలిపారు. పక్క భవనాల కోసం దివిటిపల్లిలో 42 ఎకరాలలో నిర్మించనున్న అధునాతన భవనానికి ముఖ్యమంత్రి త్వరలోనే శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ పనులు రెండు, మూడు ఏళ్లలో పనులు పూర్తిచేసి అధునాతన భవనాలను అందుబాటలోకి తెస్తామన్నారు. ఈ సందర్భంగా తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన హాస్టల్, డైనింగ్‌హాల్, తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, రెడ్డి సేవా సంఘం సభ్యులు సురేందర్‌రెడ్డి మునిసిపల్ కమిషనర్ ప్రవీణ్‌కమార్‌రెడ్డి, నాయకులు అచ్యుగట్ల అంజయ్య, గంగిరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.


తరగతి గదులను, కళాశాల ఆవరణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఇండో-నేపాల్ కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఇండో-నేపాల్ కరాటే చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన డ్రాగన్ షోటోకాన్ విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు డ్రాగాన్‌షోటోకాన్ మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడు, కరాటే మాస్టర్ ఎస్.కే. మోసీన్ తెలిపారు. టోర్నీలో 10 బంగారు, 5 వెండి, 2 బ్రౌన్, 1 కతాలో పతకం, మొత్తం 18 పతకాలు సాధించారు. పతకాలు సాధించిన డ్రాగన్ షోటోకాన్ కరాటే దూ స్పోర్ట్స్ ఫౌండర్ సాలంబిన్ ఉమర్ అభినందించారు.


ఇండో-నేపాల్ కరాటే టోర్నీలో పతకాలు సాధించిన డ్రాగన్ షోటోకాన్ విద్యార్థులు

పశువులతో పంట చేను ధ్వంసం

- అడిగినందుకు దాడి

నవాబ్‌పేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పంటచేను పశువులతో మేపి ధ్వంసం చేసిన వ్యక్తిని పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడదామని పిలిచినందుకు ఆయన కుమారుడు మమల్ని పంచాయితీకి పిలుస్తావా అంటూ దాడి చేసిన సంఘటన నవాబ్‌పేట మండలంలోని కాకర్లపాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం... గ్రామానికి చెందిన వార్స మారుతికి చెందిన మొక్కజొన్న పంటను అదే గ్రామానికి చెందిన కావటి కృష్ణయ్య తాగిన మైకంలో తన గేదెలతో ఈనెల 17న మేపి ధ్వంసం చేశాడు.

ఈ విషయంపై మారుతి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుందామని పిలచేందుకు యత్నించగా ఆయన కుమారుడు నాగరాజు అకారణంగా భూతు మాటలు తిడుతూ రాయితో ముఖంపై దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చేరాడు. గాయ పర్చిన వ్యక్తిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మునిసిపాలిటీలో గంగాపురం వెళ్లే దారిలో హరినివాస్ సమీపంలోని వెంకటేశ్వరకాలనీలో సోమవారం మధ్యాహ్నం తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. జడ్చర్ల ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాల మేరకు... కాలనీలో నివాసం ఉంటున్న మాదరి ఆంజనేయులు ఇంట్లో చోరీ జరిగిందని తెలిపారు. ఉదయం 11.30గంటల సమయంలో ఇంటికి తాళం వేసి బ్రహ్మంగారి గుడి సమీపంలోని తమ దుకాణానికి వెళ్లి, మధ్యాహ్నం 1.30నిమిషాలకు ఇంటికి వచ్చారని తెలిపారు. ఇంటికి వేసిన తాళం విరగ్గొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా చోరీ జరిగిందని గుర్తించి, సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు.

ఇంట్లో బీరు వాలో దాచిన 8తులాల బంగారు వస్తువులు, 8తులాల వెండి వస్తువులతో పాటు రూ.30వేల నగదు చోరీ అయ్యాయని బాధితుడు ఆంజనేయులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఆత్మకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వివాహిత అదృశ్యం అయిన సంఘటన ఆత్మకూరు పట్టణకేంద్రంలో చోటు చేసుకుంది. వడ్డె అంజమ్మ భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఆత్మకూరు పట్టణ కేంద్రానికి చెందిన వరికుప్పల తిరుపతి, రాములమ్మ దంపతు లు కాగా రాములమ్మ చెల్లెలు వడ్డె అంజమ్మకు అనారోగ్య సమస్యలు ఉన్నందున బావ వరికుప్పల తిరుపతికి ఇచ్చి గత 15 సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిపించారు. గత నెల క్రితం 2వ భార్య అయిన అంజమ్మ బంగారు చెవి కమ్మలు కుదువ పెట్టినారని, నా చెవి కమ్మలు నాకు విడిపించాలని ఈనెల 15వ తేదీన ఉదయం 9:30 గంటల సమయంలో భర్త తిరుపతయ్య మొదటి భార్య రాములమ్మతో గొడవ పడింది. ప్రస్తుతం డబ్బులు లేవు. డబ్బులు జమ కాగానే విడిపించి ఇస్తామని రాములమ్మ తెలిపింది. అదే రోజు మూడు గంటల సమయంలో భర్త తిరుపతయ్య దగ్గరకు వెళ్లి ఆసుపత్రికి వెళ్లి వస్తాను డబ్బులు ఇవ్వాలని అడిగింది. భర్త వెయ్యి రూపాయలు ఇచ్చాడు.

ఆసుపత్రికని తిరిగి వెళ్లిన అంజమ్మ రాత్రి వరకు ఇంటికి రానందున భర్త తిరుపతయ్య మొదటి భార్య రాములమ్మలు చుట్టు పక్కల గ్రామాల బంధువుల ఇళ్లలో వెతకగా సమాచారం లభించలేదు. సోమవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చారని తెలిపారు.

కస్తూర్బా విద్యార్థిని..

దేవరకద్ర, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని అదృశ్యమైన్న సంఘటన చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని డోకూర్ సమీపం దగ్గర ఉన్న కస్తూర్బాలో అక్షిత అనే విద్యార్థి ఇంటర్ సెకండియర్ చదువుతుంది. ఆదివారం ఉదయం పాఠశాల నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఇంటికి కూడా పోలేదని తల్లితండ్రులు చెప్పడంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రైం కార్నర్

గొంతులో గుడ్డు ఇరుక్కుని వ్యక్తి మృతి


ఈశ్వరయ్య (ఫైల్)

కల్వకుర్తి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గొంతులో గుడ్డు ఇరుక్కుని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ముకురాలలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండల పరిధిలోని ముకురాల గ్రామానికి చెందిన ఇంజమూరి ఈశ్వరయ్య(56) ఆదివారం రాత్రి భోజనం చేయడానికి అన్నంతో పాటు గుడ్డును పెట్టుకున్నారు. భోజనం తినే క్రమంలో గుడ్డు గొంతులో ఇరుక్కుంది. దీంతో ఊపిరాడక ఇబ్బంది పడ్డాడు. గుర్తించిన కుటుంబీకులు గొంతులో నుంచి గుడ్డు తీసేందుకు ప్రయత్నించారు. అపస్మారక స్థితికి చేరుకోవడంతో హుటాహుటిన కల్వకుర్తిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఈశ్వరయ్య మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు కిందపడి మహిళ..

కోస్గి రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కిందపడి ఓ మహిళ మృతి చెందిన ఘటన సోమవారం నారాయణపేట జిల్లా గుండుమాల్ మండల కేంద్రంలో చోటు చేసుకొంది. కోస్గి ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం... గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన బోడ లక్ష్మి(45) సొంత పనుల నిమిత్తం కోస్గి వెళ్లి, గుండుమాల్‌కు ఆర్టీసీ బస్సులో తిరుగుప్రయాణం అయ్యింది, గుండుమాల్ అంబేడ్కర్ చౌరస్తా దగ్గర ఆమె బస్సు దిగే క్రమంలో కిందపడి పోగా గమనించని డ్రైవర్ బస్సును ముందుకు కదలించడంతో బస్సు వెనక చక్రాలు ఆమెపై నుంచి పోవడంతో తీవ్ర రక్త గాయాలయ్యాయి. 108లో కోస్గి ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త బోడ చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నారాయణపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గోపాల్‌పేటకు చెందిన వర్కార్ శ్రీనివాసులు(48) నారాయణపేట పట్టణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం కాలినడకన వెళ్తుండగా, కాళమ్మరోడ్ క్రాసింగ్ దగ్గర ఓ బైక్ వేగంగా వచ్చి శ్రీనివాసులును ఢీకొనింది. దీంతో గాయాలైన అతడ్ని చికిత్సకోసం జిల్లా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా జడ్చర్ల సమీపంలో అంబులెన్స్‌లో మృతి చెందాడు. కొడుకు నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

హోంమంత్రి అమిత్‌షాను కలిసిన ఎంపీ డీకే అరుణ


కేంద్ర హోం మంత్రిని అమిత్‌షాతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సోమవారం పార్లమెంట్‌లో కలిసి పలు అంశాలపై చర్చించారు.

పార్లమెంట్ సమావేశాలలో పాల్గొంటూనే కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయాలు తదితర అంశాలపై చర్చించినట్లు ఆమె స్థానిక విలేకరులతో ఫోన్‌లో వెల్లడించారు.


ఊట్కూర్ మండలం పగిడిమర్రి వాగు ప్రవాహంతో నిలిచిన రాకపోకలు


మూసి వేసిన అల్వాల-పెద్దమందడి రహదారి


ఇటిక్యాల రైల్వే వంతెన దగ్గర నిలిచిన వర్షపు నీరు

జడివాన

» పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
» బ్రిడ్జిలపై నుంచి పారుతున్న వరద నీరు
» గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతుండటంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. బ్రిడ్జిలపై నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో పలు గ్రామాల రహదారులు మూసుకుపోయాయి. రాకపోకలు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పలు పంటలు నీటిలో మునిగిపోయాయి. కొన్ని ఇళ్లు పూర్తిగా దెబ్బతినగా, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ల వారిని సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. దుందుభీ ఉధృతంగా ప్రవహిస్తుండగా, సంగంబండ, కోయిల్‌సాగర్ గేట్లు ఎత్తి నీటిని కిందికి వదిలారు.


సంగంబండ 7 గేట్లు ఎత్తివేతతో మాగనూర్ మండలం నేరెడ్‌గామ్ వంతెనపై పారుతున్న నీరు

నారాయణపేట/ ఇటిక్యాల/ పెద్దమందడి/ జడ్చర్ల/ ఖిల్లాగణపురం/ ఉప్పునుంతల/కోడేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పలు రహదారులు దెబ్బతిన్నాయి. మంతన్‌గోడ్ నుంచి గోలపల్లికి వెళ్లే రహదారిలో రోడ్డు, కల్వర్టు దెబ్బతినింది. అక్కడక్కడ పలు రహదారులు గుంతలమయంగా మారాయి. పేట నుంచి మక్తల్‌కు వెళ్లే రహదారి, అప్పక్‌పల్లి నుంచి గుండుమాల్‌కు వెళ్లే రహదారి, మరికల్, దామరగిద్ద రహదారులలో అక్కడక్కడ గుంతలు పడి ధ్వంసమయ్యాయి. నారాయణపేటలో రోడ్లు ధ్వంసమయ్యాయి. వర్షాలు అధికంగా కురియడంతో బ్రిడ్జిలపై నుంచి నీటి ప్రవాహం ప్రవహిస్తూ పలు చోట్ల రాకపోకలు స్తంభించాయి. మాగనూర్ మండలం అడివి సత్యారం బ్రిడ్జిపై నుంచి నీరు ఏరులై పారుతున్నది. ఊట్కూర్ మండలం పగిడిమర్రి బ్రిడ్జిపై నుంచి నీరు పారుతుండటంతో అమీన్‌పూర్, ఓబ్లాపూర్, సామనూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భూనేడ్- కొత్తపల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక వర్షం నీటి ప్రవాహంతో రాకపోకలు స్తంభించాయి. నర్వ మండలం కల్వాల నుంచి సీపూర్ మధ్య బ్రిడ్జిపై వర్షంనీరు ప్రవహిస్తున్నది. కాగా మాగనూర్ మండలం బాపన్‌కుంట చెరువుకట్టకు గండి పడి నీరు పోగా తాత్కాలికంగా మట్టిని వేసి మరమ్మతులు చేశారు. మక్తల్ పెద్ద చెరువు దగ్గరలో సంగంబండ గ్రావిటీ కెనాల్ కోతకు గురైంది. మక్తల్ మండలం కర్ని చెరువు అలుగు నీటి కల్వర్టు దగ్గర నీరు పారుతుండటంతో రాకపోకలు నిలపాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ సందర్శించి అధికారులకు సూచించారు.

● గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు కురుస్తున్న భారీ వర్షంతో ఆయా గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు మండలంలోని చాగాపురం, షాబాద గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. మండలంలో 54.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తులుపుచున్నారు. అలాగే ఇటిక్యాల రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న వంతెనలో మూడు అడుగుల లోతు వర్షపు నీరు చేరడంతో ఉదయం రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆయా గ్రామాల ప్రజలు ఉదండాపురం మీదుగా ఇటిక్యాలకు చేరుకున్నట్లు వారు తెలిపారు. అలాగే మండలంలో ఉదండాపురం, షాబాద, చాగాపురం, పెద్దదిన్నె గ్రామాల పరిధిలో లోతట్టు పంటపొలాలకు వరద నీరు రావడంతో పత్తి పంట దెబ్బతిన్నట్లు ఆయా గ్రామాల రైతులు తెలుపుతున్నారు.

● ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రహదారులపైకి వరద నీరు రావడంతో అధికారులు రహదారులను మూసి వేశారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిధిలోని అల్వాల-పెద్దమందడి రహదారిలో చిన్న వాగు భారీగా పొంగి కాజ్‌వేపైకి వరద నీరు రావడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి రాకపోకలు నిలిపివేశారు. కాగా, భారీ వర్షాలు కురిసిన సందర్భంగా జగత్‌పల్లి గ్రామంలో ఒక కుటుంబం, వెల్టూరు గ్రామంలో ఒక కుటుంబం శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉంటున్నట్లు గుర్తించిన అధికారులు వారిని కమ్యూనిటి హాల్‌కు తరలించినట్లు తహసీల్దార్ సరస్వతి తెలిపారు.

● మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని లింగంపేట గ్రామ సమీపంలోని గంజివాగు నిండి అలుగెత్తింది. ఆ నీళ్లన్ని సోమవారం జడ్చర్ల, లింగంపేట గ్రామాల మధ్యదారిలోకి వచ్చి చేరాయి. దీంతో ఆ దారిలో రాకపోకలు స్తంభించాయి. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించినా, అది పూర్తి కాకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. జడ్చర్ల పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లే స్కూల్ బస్సులు నీళ్లు పారుతున్న ప్రాంతం వరకు వచ్చి, తిరిగి వెళ్లిపోయాయి. దీంతో విద్యార్థులు సైతం పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. బ్రిడ్జి నిర్మాణం చేపడ్తుండడంతో పక్కనే మట్టితో వేసిన రోడ్డుకు ఒక భాగంలో నీళ్ల ఉధృతికి కోసుకుపోయి ప్రమాదకరంగా మారింది.

● వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలంలో నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగిపొర్లి చెరువులు మత్తడి దూకుతున్నాయి. మండలంలోని ఆగారం, కమలొద్దీన్ పూర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సోమవారం అధికారులు ముళ్ల కంచె వేయడంతో పాటు గ్రామపంచాయతీ ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్ అడ్డుగా నిలిపి రాకపోకలను స్తంభింప చేశారు. షాపూర్ శివారు ప్రాంతంలో వాగులో వరద నీటి ప్రవాహం పెరగడంతో గ్రామస్తులు వాగు దాటడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోలిపూర్ చెరువు అలుగు ప్రాంతం కబ్జాకు గురి కావడంతో పంటలు మునుగుతున్నాయని తహసీల్దార్ సుగుణకు రైతులు ఫిర్యాదు చేశారు.

● ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు చీకటి వాగు ఉప్పొంగి సోమవారం ఉప్పునుంతల మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామం నుంచి కంసానిపల్లితండా రంగంపేట గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు మల్లేష్‌తో పాటు పలువురు వాపోయారు. వర్షం వచ్చిందంటే కంసానిపల్లి నుంచి కంసానిపల్లి తండా 2 కి.మీ. రంగంపేటకు 3 కి.మీ. దూరం ఉన్న గ్రామాలకు రాకపోకలు అంతరాయం కల్గుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వచ్చినప్పుల్లా గ్రామాలకు ఎలా వెళ్లాలని వారు ప్రశ్నిస్తున్నారు.

● కోడేరు మండలంలో ప్రతి రోజు వర్షం కురవడంతో మెట్ట పొలాల్లో నీరు పడుతున్నదని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వరి పైరులు నీటి మునిగినట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఇలాగే కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టం పోవాల్సి వస్తుందన్నారు. వాగులు వంకలు పొంగి పొర్లడంతో వ్యవసాయదారులు, ప్రయాణికులుఇబ్బందులు పడుతున్నారు.


ఉప్పునుంతల: వరద నీటిలో ఇబ్బందిగా దాటుతున్న రంగంపేట గ్రామస్థులు


ఆగారం, కమలొద్దీన్ పూర్ గ్రామాల మధ్య వాగు కల్వర్టు పై రాకపోకలు నిలపడానికి ఉంచిన ముళ్ల కంచే , వాటర్ ట్యాంక్


జడ్చర్ల మండలం లింగంపేట గ్రామ సమీపంలో గంజివాగు అలుగెత్తడంతో జడ్చర్ల, లింగంపేట మధ్యదారిలో వచ్చి చేరిన నీళ్లు

వర్షాలకు కూలిన ఇళ్లు


అప్పారెడ్డిపల్లిలో కూలిన దారం నాగమ్మ ఇల్లు


దేదినేనిపల్లి గ్రామంలో వర్షానికి కూలిన దూదేకుల సుల్తాన్ ఇల్లు

పెద్దకొత్తపల్లి/ దామరగిద్ద/ నవాబ్‌పేట/ అలంపూర్/ ఇటిక్యాల/ ఊట్కూర్/ అమ్రాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని దేదినేనిపల్లి గ్రామంలో మట్టి మిద్దె కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. దేదినేనిపల్లి గ్రామానికి చెందిన దూదేకుల సుల్తాన్ నివాసముంటున్న మట్టి మిద్దె గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తడిసి ఆదివారం రాత్రి నేలమట్టమైంది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని బాధితుడు తెలిపారు. దూదేకుల సుల్తాన్ ఇల్లు వర్షానికి కూలిపోవడంతో నివాసం ఉండటానికి గూడు లేకుండా పోయింది.

● వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి మట్టి మిద్దె సోమవారం కూలిపోయింది. దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన నిరుపేద రైతు దూల్లకాడి రాములు తనకు ఉన్న రెండు రూముల మట్టిమిద్దె గత వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇల్లు కూలిపోయింది. నిరుపేద కుటుంబానికి చెందిన రాములును ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని తహసీల్దార్ తిరుపతయ్యకు వినతి పత్రాన్ని అందించారు. వెంకటప్ప, రాములు పాల్గొన్నారు.

● నవాబ్‌పేట మండలంలోని కురుస్తున్న భారీ వర్షాలకు గురుకుంటలో బోవొళ్ల జంగయ్య ఇల్లు కూలిపోయిందని గ్రామస్థులు బోవొళ్ల రాజశేఖర్ మంగళవారం తెలిపారు. అలాగే మండలంలో ఇప్పటి వరకు మొత్తం మూడు ఇళ్లు కూలినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

● భారీ వర్షాల కారణంగా అలంపూర్ మండలంలో పలు చోట్ల మట్టి మిద్దెలు కూలాయి. ఆదివారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి మునిసిపాలిటీలో ఇళ్లు కూలిన వారికి మునిసిపల్ కమిషనర్ శ్రీరాములు పాత మునిసిపాలిటీలో పునరావాసం కల్పించారు. అలాగే మండల పరిధిలోని క్యాతూర్ గ్రామంలో మూడు నివాసాలు, లింగనవాయి గ్రామంలో ఒకటి నేల మట్టమయ్యాయి. క్యాతూరు గ్రామంలో ఎంపిడీఓ పద్మావతి, పంచాయతీ సెక్రటరీ దేవిక సంఘటన స్థలాన్ని పరిశీలించి ఇళ్లు కూలిన వారిని ప్రాథమిక పాఠశాల బాలుర స్కూల్‌లో, వారి బంధువుల ఇళ్లలో పునరావాసం కల్పించారు. లింగనవాయిలో ఆర్‌ఐ బడేసాబ్ పరిశీలించి వారి బంధువుల ఇంటిలో ఆశ్రయం కల్పించారు.

● గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం సాతర్ల గ్రామంలో రఫీ అనే వ్యక్తి ఇంటి మిద్దె కప్పు కూలిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. మట్టి మిద్దె ప్రమాదకరంగా ఉండటంతో ముందు జాగ్రత్తతో బంధువుల ఇంటిలో నిద్రించడంతో ప్రమాదం తప్పినట్లు తెలిపారు.

● ఊట్కూర్ మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో చిన్నపూజారి జయ్యమ్మ మట్టి ఇల్లు, పగిడిమారి గ్రామంలో నలుగురి మట్టి ఇళ్లు కూలి పడ్డాయి.

● ఖిల్లాగణపురం మండలంలో కురిసిన వర్షాలకు సోమవారం 5 పాత ఇళ్లు కూలిపోయాయి. అప్పారెడ్డిపల్లి గ్రామంలో దారం నాగమ్మ మట్టి మిద్దె ఇల్లు, సల్కెలాపూర్ గ్రామంలో భీమమ్మ ఇల్లు, ఉప్పరిపల్లి గ్రామంలో వెంకటయ్య ఇల్లు, ఖిల్లాగణపురంలో రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

● అమ్రాబాద్ మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం మంతటి నారమ్మ, కల్మల లక్ష్మమ్మ, అర్జునమ్మకు చెందిన ఇళ్లు కూలిపోయాయి. పంచాయతీ కార్యదర్శి రాజారాం పరిశీలించారు. మండలంలోని వెంకటేశ్వరబావి, మన్ననూర్లలో వర్షం కారణంగా మరో నాలుగు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.


దామరగిద్దలో వర్షానికి కూలిన రాములు మట్టిమిద్దె


అమ్రాబాద్ మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో ముసురు వర్షానికి కూలిన ఇల్లు


అలంపూర్ మునిసిపాలిటీలో కూలిన మట్టి మిద్దెను పరిశీలిస్తున్న వార్డ్ ఆఫీసర్లు

ఉధృతంగా దుందుభీ


తాడూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నది

» లోలెవల్ కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీరు
» ఐతోల్, సిర్సవాడ గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు


సంగంబండ జలాశయం 7 గేట్లు తెరవడంతో దిగువకు వెళ్తున్న నీరు

తాడూరు/మక్తల్‌రూరల్/దేవరకద్ర/, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : తాడూరు మండలంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువులు, కుంటలు అలుగులు పారడంతో పాటు దుందుభీ నది ప్రవాహం సోమవారం ఉధృత మైంది. మండల వ్యాప్తంగా రాత్రి 6.2 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ప్రధాన రహదారులపై ఉన్న లోలెవల్ కాజ్‌వేలపై నుంచి వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఒక గ్రామానికి మరొక గ్రామానికి రాకపోకలు నిలిచి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నాగర్‌కర్నూల్, జడ్చర్ల ప్రధాన రహదారిపై సిర్సవాడ ఐతోల్ గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ కాజ్‌వేపై వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. అదేవిధంగా పొల్మూ రు,గుట్టలపల్లి, చెర్లతిర్మలాపూర్, ఉయ్యాలవా డ, ఆకునెల్లికుదురు, మేడి పూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపో యాయి.

దుందుభీ అవతలి భాగంలో వ్యవసాయ పొలాల్లో పంటలు ఏమయ్యాయో అంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.


సిర్సవాడ వద్ద దుందుభీ నది వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది

కోయిల్‌సాగర్‌కు 5 షటర్లు తెరిచి దిగువకు నీటి విడుదల

మహబూబ్‌నగర్ జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్ సాగర్‌కు వరద ఉధృతి బాగా పెరిగింది. దీంతో సోమవారం ప్రాజెక్టు 3 షటర్లు ఫీటు ఎత్తు తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.5 అడుగులు కాగా సోమవారం నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 32. అడుగులకు చేరింది. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు కురవడంతో అంకిళ్ల, కోయిల్‌కొండ పెద్దవాగుల నుంచి ప్రాజెక్టుకు నీటి ఉధృతి పెర గడంతో అధికారులు 5 షటర్ల నుంచి దిగువకు 7500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నుంచి నీరు రావడంతో జిల్లా నుంచి సందర్శకులు అందాలను తిలకించేం దుకు వస్తున్నారు.

అలుగు దాటుతూ...

» విధులకు హాజరవుతున్న వైద్య సిబ్బంది

మక్తల్‌రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని కర్ని గ్రామం వద్ద చెరువు అలుగు పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇటు కర్ని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాల్సి ఉండటంతో ప్రతి రోజు అలుగు దాటుకుంటూ విధులకు హాజరై వైద్య సేవలు అందిస్తున్నారు.

వీరితో పాటు ఇతర ప్రభుత్వ సిబ్బంది సైతం కచ్చితంగా హాజరు కావాల్సి ఉండటంతో అలుగు దాటుతూనే విధులు నిర్వహిస్తున్నారు. వీలైనంత తొందరగా శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

సంగంబండ 7 గేట్లు ఎత్తి నీటి విడుదల

నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం 7 గేట్లు ఎత్తి అధికారులు నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి పెద్ద వాగుకు వరద నీటి ఉధృతి ఎక్కువగా వస్తుండడంతో సోమవారం 7 గేట్లతో దిగువకు నీటి విడుదల కొనసాగించారు. 6000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 6000 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందని, రిజర్వాయర్ నీటి పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.60 టీఎంసీలు ఉందని ఇరిగేషన్ డీఈ సురేష్ తెలిపారు.

న్యూస్ బాక్స్

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గద్వాల సర్కిల్, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన నాయీబ్రాహ్మణుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని నాయీబ్రాహ్మణ సంఘం గద్వాల ప్రతినిధులు శివరాంగోపాల్, ఆంజనేయులు, పద్మయ్య, శ్రీనివాసులు, నర్సప్ప, జానకిరాములు, బలరాం, జయన్న కోరారు. కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు సామాజిక, ఆర్థిక, రాజకీయరంగంలో స్థానం కల్పిస్తామని మాటలు చెబుతూ వస్తున్న ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పాలకులు మారుతున్నారే కానీ తమ జీవన స్థితులు మారడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో సందర్భంలో ఇచ్చిన మాటలు నిలబెట్టుకునేలా రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు తమ వర్గీయులకు నామినేటెడ్ పోస్టుల్లోనూ స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

శ్రీకృష్ణస్వామికి ప్రత్యేక పూజలు

- సద్దలోనిపల్లిలో స్వామిని దర్శించుకున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

మల్దకల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సద్దలోనిపల్లిలో స్వయంభువు శ్రీకృష్ణ స్వామిని సోమవారం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆమెతో పాటు అల్వాల రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచులు గోపాలు, అశోక్ ఆంజనేయులు రామకృష్ణ, ఆలయ మాజీ చైర్మన్ లవన్న ఉన్నారు.

వైభవంగా భైరవేశ్వరుడి ఊరేగింపు

ఉండవల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని భైరాపురంలో భైరవేశ్వరుడి ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నిత్య ఆశ్రమం నుంచి నందికోలసేవ, వీరభద్ర వేషధారణతో భైరవేశ్వరుడిని ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు.అనంతరం గ్రామస్థులు, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామప్రజలతో పాటు జిల్లా అధ్యక్షుడు నీలప్ప, చంద్రశేఖర స్వామి పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

రాజోలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజోలిలోని కస్తుర్బా గాంధీ బాలల విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ జిల్లా బాలల సంరక్షణ విభాగం ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్‌ఐ గోకారి మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతి ఒక్క ఒక గోల్ పెట్టుకోవాలని, ఆ దిశగా అడుగులు ముందుకు వేయాలని, గమ్యానికి చేరుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి చంద్రకళ, మండల వైద్య అధికారి డా. మధుబాబు, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తి పంట రక్షణకు తక్షణ చర్యలు అవసరం

● మండల వ్యవసాయ అధికారి అనిత

ఉండవల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పత్తి పంట దెబ్బతినకుండా రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనిత రైతులకు సూచించారు. ఉండవల్లి గ్రామంలోని పత్తి పంటలను సోమవారం మండల వ్యవసాయ అధికారి పరిశీలించారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ పత్తి పంటకు ఎర్రనల్లి(రెడ్‌మైట్) ఆశించిందని, వెంటనే స్పైరోమెసిఫెన్ మందును ఒక మిల్లీలీటరు నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే ఈ నెలలో తేమ ఎక్కువగా ఉండటం విల్ల పంటలు నేల ద్వారా అవసరమైన పోషకాలను సకాలంలో గ్రహించలేక పోతున్నాయని చెప్పారు. అందువల్ల రైతులు 13-0-45 నీటిలో కరిగే ఎరువును లీటరుకు ఐదు నుంచి పది గ్రాములు కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు.

ఘనంగా పల్లకీసేవ

రాజోలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాని వీధుల్లో శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామివారి పల్లకీ ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం నాలుగవ సోమవారం సందర్భంగా రాజోలిలోని ఉరుకుంద ఈరన్నస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో స్వామి వారి పల్లకీని డప్పులు వాయిస్తూ ఊరేగింపు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు బత్తలయ్య, గంగన్న, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గోడకూలి నాలుగు మేకలు మృతి

వడ్డేపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురంలో సోమవారం బోయ వెంకట్‌రాముడుకు చెందిన నాలుగు మేకలు గోడ కూలి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోడ మెత్తగా మారి కూలి పడటంతో మేకలు మృతి చెందాయని బాధితుడు వాపోయాడు. సంబంధిత అధికారులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధితుడికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

అంగన్‌వాడీల్లో ప్రైమరీ విద్య

గద్వాలన్యూటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలంటే ప్రీ ప్రైమరీ స్కూల్ పీఎం శ్రీవిద్యను అంగన్‌వాడీ సెంటర్‌లోనే కొనసాగించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్ల జిల్లా కార్యదర్శి ఎమేలమ్మ సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ, నర్మద, సావిత్రమ్మ, లక్ష్మీ కాంతమ్మ, పుష్ప ఉన్నారు.

డబుల్ ఇళ్లను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి

● వారంలోగా పెండింగ్ పనులను పూర్తి చేయాలి

● కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించేందుకు అన్ని హంగులతో మిగిలి ఉన్న పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో డబుల్‌బెడ్ రూమ్ పెండింగ్ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ మాసం మొదటి వారంరోజులో డబుల్ బెడ్ ఇళ్ల సముదాయాలను ప్రారంభోత్సవం చేసేలా మిగిలి ఉన్న అన్ని పనులను వారంలో పూర్తి చేయాలన్నారు. 715 డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు మిగిలి ఉన్న అన్ని పనులను పూర్తి చేయాలని విద్యుత్, కుళాయిలకు నీటి కనెక్షన్లు, పెయింటింగ్ పనులన్నింటినీ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియ పునఃపరిశీలించుకుని లబ్ధిదారుల మంజూరు ఉత్తర్వులను సిద్ధం చేయాలన్నారు. డబుల్ బెడ్ ఇళ్ల సముదయాయాల వద్ద రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్య పనులను చేపట్టి సెప్టెంబర్ మొదటి వారంలో ప్రా రంభోత్సవానికి అన్ని హంగులతో సిద్ధం చేయా లన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, సంబంధిత అధికారులు ఉన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● కలెక్టర్ బీఎం సంతోష్

● ప్రజావాణిలో 40 ఫిర్యాదులు

గద్వాలన్యూటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు ఉన్నారు.

నీటి కనెక్షన్‌కు డబ్బులు అడుతున్నారు..

మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ విషయంలో లైన్‌మెన్ డబ్బులు అడుతున్నారని సోమవారం 3వవార్డు కాలనీవాసులు పరశురాము, నర్సింహులు, సలీమ్, టి.నర్సింహులు, సిద్దన్న, కృష్ణ ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో మిషన్ భగీరథ లైన్‌ను కనెక్షన్ చేశారని, అయితే ఇప్పుడు ఆన్‌లైన్ కనెక్షన్‌కు సంబంధించి ఒక లైన్ కనెక్షన్ ఉంటే రూ.3వేలు, రెండు కనెక్షన్‌లు ఉంటే రూ.18వేలు అడుతున్నారని కలెక్టర్ ఫిర్యాదు చేశారు. దీంతో ఇందుకు సంబంధించి ఆరా తీయాలని, పూర్తి వివరాలు సేకరించాలని మునిసిపల్ కమిషనర్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

జనజీవనం అతలాకుతలం

● పొంగిన వాగులు, వంకలు

● పలుచోట్ల కూలిన ఇళ్లు.. నీట మునిగిన పంటలు

● వాగులకు తగ్గని వరద ఉధృతి

● పరివాహక గ్రామాలకు స్తంభించిన రాకపోకలు



మానవపాడు వాగు వద్ద తహసీల్దార్, పోలీస్ అధికారుల పర్యవేక్షణ



ఉత్తనూర్, తుపతురాల మధ్య వాగువద్ద పోలీసుల బందోబస్తు

అలంపూరుచౌరస్తా/గట్టు/ ఉండవల్లి/ వడ్డేపల్లి/అయిజ/ మానవపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వరుణుడి ప్రతాపంతో జిల్లాలో వాగులు, వంకలు పొంగిపొరుతున్నాయి. పలు గ్రామాల్లో జనజీవనం స్తంభించింది. పాత ఇళ్లు కూలిపోయాయి. రోడ్లు తెగి రాకపోకలు నిలిచిపోయాయి. పంటపొలాల్లో నీళ్లు నిలిచిపోవడంతో రైతాంగం లబోదిబోమంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పత్తి, కంది, మొక్కజొన్న పంట లు చేతి కందకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొంకూరు, మెన్నిపాడు, పుల్లూరు, ఉండవల్లి, మారమునగాల, ప్రాగటూరు, తక్కశిల, కంచుపాడు గ్రామాల్లో ఎత్తి, కంది, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఉండవల్లి మండలంలో సుమారు 50 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. సోమవారం ఉండవల్లి ఎస్సై శేఖర్, తహసీల్దారు ప్రభాకర్ వివిధ గ్రామాల్లో పర్యటించారు. పాత ఇళ్లలో ఉండరాదని, వాగులు వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

● తెగిన బోయలగుడ్డం రోడ్డు

గట్టు మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రైతులు పొలాలకు వెళ్లలేక పోతున్నారు. నీటి ఉధృతికి రోడ్లు కోతకు గురయ్యాయి. బోయలగుడ్డం నుంచి చిన్నోనిపల్లి లింగాపురం రోడ్డు తెగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు చొరవ తీసుకుని మరమ్మతులు చేయించారు.

● మట్టి ఇళ్లలో నివాసం ఉండరాదు

వడ్డేపల్లి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పాతబడిన మట్టి మిద్దెల్లో నివాసం ఉండరాదని పంచాయతీ కార్యదర్శి సత్యకి సూచించారు. సోమవారం జులేకల్ గ్రామంలో మట్టి మిద్దెలో నివాసముంటున్న బోయ కొండలమ్మ ఇంటిని పరిశీలించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కూలే ప్రమాదం ఉందని, తక్షణమే ఖాళీ చేసి గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లాలని చెప్పారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కొండలమ్మ కోరారు. అయిజ పట్టణం సమీపంలో ఉన్న పోలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మంత్రాలయం, ఎమ్మిగనూర్, ఆదోని, మేడికొండ, పులికల్ గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి. అయిజ, ఉత్తనూర్ మధ్యన ఉన్న వంక, ఉత్తనూర్, తుపతురాల మధ్యన వాగులు పొంగిపొర్లటంతో పూర్తిస్థాయిలో రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ఈ దారిన ఎవరిని వెళ్ళకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అక్కడ పోలీసులను ఏర్పాటు చేశారు. పంట పొలాలు వర్షం నీటితో ఉండిపోయాయి.

● మానవపాడు మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు వాన కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. 15 రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పత్తి, మిర్చి, కంది పంటలు ఆగమయ్యాయి. వాగులు వంకలు పొంగిపారుతున్నాయి. మానవపాడు మండల కేంద్రం నుంచి అమరవాయి గ్రామాని వెళ్లే దారిలోని పెద్దవాగు పొంగిపారింది. అదేవిధంగా నారాయణపూరం గ్రామానికి జాతీయ రహదారి నుంచి వెళ్లేదారిలో అండర్ రైల్వే బిడ్జి నిండా వర్షపు నీరు నిలవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం కురుస్తున్న వర్షానికి ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏవైన ఇబ్బందులుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ జ్యోషి శ్రీనివాస్ శర్మ అన్నారు.

● వర్షం కారణంగా రాజోలి మండలంలోని పలు గ్రామాల్లో మట్టి మిద్దెళు కూలుతున్నా యి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు కురుస్తున్న భారీ వర్షంకు మండల కేంద్రమైన రాజోలికి చెందిన మహబీ కొట్టం గోడలు కూలిపోయి పక్కనే కొత్తగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటిపై పడటంతో కొత్త ఇంటిగోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రాజోలి ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, ఎస్‌ఐ గోకారి కలిసి కొట్టాన్ని పరిశీలించి, ఆమెను వేరే ఇంటికి తరలించారు. అదేవిధంగా మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో బోయ పద్మావతికి చెందిన ఇంటి మట్టి మిద్దె కూలిపోవడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి వీరేష్ కూలిన ఇంటిన పరిశీలించి వేరే ఇంటికి తరలించారు. మండలంలోని తూర్పు గార్లపాడులో ఒక ఇంటి పైకప్పు పాక్షికంగా కూలినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారు అధికారులకు సామాచారం ఇవ్వాలని, వారికి నివాసం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.



బోయలగుడ్డం వద్ద తెగిన రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న పోలీసులు



మాన్‌దొడ్డిలో కూలిన మట్టిమిద్దెను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి వీరేశ్



రాజోలిలో ఇంటి గోడలు కూలిన మహబీ కొట్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సర్వాయి పాపన్న ధీరత్వం ఆదర్శం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

● జిల్లా వ్యాప్తంగా ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



గద్వాలలో పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



గద్వాలలో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గద్వాల టౌన్/ ధరూర్/ గట్టు/ వడ్డేపల్లి/ అయిజ/ మానవపాడు/ అలంపూర్ చౌరస్తా/ ఉండవల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బలహీనవర్గాల చైతన్యం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న త్యాగం, ధీరత్వం నేటి సమాజానికి ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు పాపన్నగౌడ్ 375వ జయంతిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలో దివంగత నాయకుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ గీత సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దేవదాస్, శ్యాంరావు, మధుగౌడ్, నరసింహ, పవన్‌కుమార్ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్ ఉన్నారు.

● బీఆర్‌ఎస్ నాయకుల నివాళి : సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి బీఆర్‌ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో కురువ పల్లయ్య, మోనేష్, బీచుపల్లి, రాజారెడ్డి, రాజు, సోమశేఖర్ రెడ్డి, శేఖర్‌నాయుడు, వీరేశ్‌గౌడ్, వెంకటేశ్ నాయుడు, ఎండీ మాజ్ ఉన్నారు. అలాగే నడిగడ్డ యువత ఆధ్వర్యంలో సురేశ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, వీరేశ్‌గౌడ్, తిమ్మన్నగౌడ్, శ్రీనివాసులు, గట్టన్ననాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● బీసీ స్టడీ సర్కిల్‌లో: స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి డైరెక్టర్ రాములు పూలమాల వేసి నివాళి అర్పించారు.

● అలంపూరుచౌరస్తా : కంచుపాడు మాజీ సర్పంచు శేషన్‌గౌడు ఆధ్వర్యంలో సోమవారం అలంపూరు చౌరస్తా ప్రధాన కూడలిలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిఅర్పించారు. సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టెంపుల్ చైర్మన్ రవిప్రకాష్, వెంకటేష్, నరేందర్, నర్సన్‌గౌడు, గోపాల్, మద్దిలేటి, విజయ్, తిరుపాల్‌రెడ్డి, రాంబాబు, దామోదర్‌గౌడు, రామకృష్ణ, మధు, సత్యం ఉన్నారు.

● గట్టు తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్ సర్వాయి పాపన్నగౌడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీతా కార్మికులు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● ధరూరులోని కార్యాలయంలో తహసీల్దార్ నరేందర్ పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మంగమ్మ, ఆర్‌ఐలు రాఘవేంద్ర, నర్సింలు, సీనియర్ అసిస్టెంట్ తిరుమలేశ్, కంప్యూటర్ ఆపరేటర్ లక్ష్మణ్ ఉన్నారు.

● గౌడ సంఘం ఆధ్వర్యంలో శాంతినగర్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాధాక్రిష్ణ గౌడ్, వెంకట్రామన్ గౌడ్, రాజోలి మండల అధ్యక్షుడు జయన్న గౌడ్, మద్దిలేటి గౌడ్, ఖాసీం గౌడ్, తిమ్మయ్య గౌడ్, అయ్యన్న గౌడ్ ఉన్నారు.

● ఉండవల్లిలోని కార్యాలయంలో తహసీల్దార్ పాపన్నగౌడ్ చిత్రపటానికి తహసీల్దార్ ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయబ్ తాసీల్దార్ రమణ, ఆర్‌ఐ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

● అయిజలో గీతాకార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రకాశ్‌గౌడు పాల్గొని పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగు శ్రీధర్, సవారిగౌడు, వెంకట్రాములుగౌడు, రమేష్‌గౌడు, భూపతి గౌడు, గోవింద్‌గౌడు, శంకర్‌గౌడు పాల్గొన్నారు.

● మానవపాడు మండల కార్యాలయం వద్ద తహసీల్దార్ జ్యోషిశ్రీనివాస్‌శర్మ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డీటీ కరుణాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీవాణి, ఆర్‌ఐలు గురురాజు, రవితేజ ఉన్నారు.

నేడు జములమ్మ కల్యాణోత్సవం

- ఎదుర్కోలు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



స్వామివారిని పల్లకీలో తీసుకెళ్తున్న చైర్మన్ వెంకట్రాములు, మాజీ చైర్మన్ సతీష్‌కుమార్



పల్లకీని మోస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) నడిగడ్డలో భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న జములమ్మ కల్యాణోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ, పూలతో అందంగా అలంకరించారు. ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఎదుర్కోళ్లను నిర్వహించేందుకు జములమ్మ ఆలయం నుంచి పల్లకిలో జమ్మిచేడులోని ఆంజనేయస్వామి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు వివిధ వేశాధారణలతో చేసిన విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జమ్మిచేడు గ్రామానికి చేరుకున్న తర్వాత స్వామివారికి ఎదుర్కోలు కార్యక్రమం గ్రామస్థుల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై దగ్గరుండి ఎదుర్కోలు కార్యక్రమం జరిపించారు. అనంతరం స్వామివారి పల్లకీసేవను మోశారు. దీనిని చూసేందుకు పెద్ద ఎత్తున గ్రామస్తులు ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి తిరిగి స్వామివారిని ఆలయంలోకి చేర్చారు.

నేడు అమ్మవారికి కల్యాణం

శ్రీ జమదగ్ని సమేత జములమ్మ అమ్మవారికి మంగళవారం కల్యాణం నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12గంటలకు ఎమ్మెల్యే దంపతులచే కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వెంకట్రాములు తెలిపారు. పెద్దఎత్తున భక్తులు, ప్రజలు హాజరై అమ్మవారి ఆశీర్వాదం పొందాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.

జాతీయ స్థాయి యమగుచి కరాటే పోటీల్లో ప్రతిభ

● ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యమగుచి కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఇండో- నేపాల్ కరాటే చాంపియన్‌షిప్-2025 జాతీయస్థాయి పోటీలు ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన విషయం తెలిసిందే. ఇందులో గద్వాల జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిబ కనబరిచారు. ఈ పోటీల్లో అరవింద్, శరత్ గోల్డ్ మెడల్స్ సాధించగా బొల్లెద్దుల చార్విక్, అబి సిల్వర్ మెడల్స్ బొల్లెదుల వేద జనని బ్రౌండ్ మెడల్ సాధించారు. విజేతలను సోమవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌చైర్మన్ వేణుగోపాల్, నాయకులు ఉన్నారు.

చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలి

- వ్యవసాయ అధికారి నాగార్జున రెడ్డి

అలంపూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గత 15 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల పంటలకు చీడ పీడలు పట్టకుండా తగిన నివారణా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి తెలిపారు. అలంపూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం పత్తి, మొక్క జోన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం వానాకాలం మండలంలో ప్రత్తి 2135, మొక్క జొన్న 7100, కంది 1035, వరి 603 ఎకరాలు సాగులో ఉందని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు చీడపీడల నుంచి జాగ్రత్తలు తీసుకున్నట్లైతే పంటలను కాపాడుకోవచ్చని, పొలాల్లో నీరు నిలిస్తే కాలువలు తీసి నీటిని బయటకు పంపుకోవాలని, అధిక తేమ శాతాన్ని తగ్గించుకొని అంతరసేద్యం చేసి నివారణ మందులు పిచికారి చేసుకోవాలని తగు సూచనలు ఇచ్చారు. వీరివెంట వ్యవసాయ విస్తరణ అధికారి సాయి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి : ఎస్పీ

గద్వాల క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేయాలని ఎస్పీ శ్రీనివాసరావు అధికారులకు ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యాక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 10 ఫిర్యాదులు రాగా నేరుగా ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యను డిగి తెలుసుకున్నారు. ఇందులో భూ వివాదాలకు సంబంధించి 5 ఫిర్యాదులు, భర్తల వేధింపులకు సంబంధించి 2, ద్విచక్ర వాహనం సంబంధించి 1, ఇతర అంశాలకై సంబంధించి 2 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టపరంగా త్వరగా పరిష్కరించేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

పౌరహక్కుల సంఘం నేతపై కత్తితో దాడి

మల్దకల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కూర్ గ్రామానికి చెందిన పౌరహక్కుల నేత ఎల్కూర్ మహేష్‌పై అదే గ్రామానికి చెందిన బోయబీసన్న పాత కక్షలు మనసులో ఉంచుకొని సోమవారం సాయంత్రం ఎల్కూర్‌లోనే దాడి చేశాడని మల్దకల్ ఎస్‌ఐ నందీకర్ తెలిపారు.

కత్తిపోట్లకు గురైన మహేష్‌ను గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనధికార మెడికల్ స్టోర్‌పై దాడి: మందులు సీజ్



అనధికారికంగా విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన మందులు



సీజ్ చేసిన మందులతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

గద్వాల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇటిక్యాల మండలం ఉదండాపురంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మెడికల్ షాప్ అండ్ క్లినిక్‌పై సోమవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల బృందం దాడులు నిర్వహించింది. మహబూబ్‌నగర్ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో గద్వాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్, నాగర్ కర్నూల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఉదండాపురంలో మసూద్ అహ్మద్ అనే వ్యక్తి అనిధికారికంగా చికిత్సాలయంలో విక్రయం చేస్తున్నట్లు గుర్తించామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్ తెలిపారు. దాదాపు 67రకాల ఆలోపతి ఔషధాలను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.40వేలు ఉంటుందని తెలిపారు. ఇందులో 38రకాలు ఫిజీషియన్స్ శాంపిల్స్ ఉండగా 29రకాలు సేల్స్ ప్యాక్స్ ఉన్నాయని తెలిపారు. వీటిని చికిత్స, విక్రయ కోసం నిల్వ చేయడం డ్రగ్ అండ్ కాస్మోటిక్ యాక్ట్ ఉల్లంఘన కిందికి వస్తుందని నిల్వ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ధరూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలని గద్వాల వైద్య ఆరోగ్య బృందం సభ్యులు సూచించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ(ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమంలో భాగంగా సోమవారం ధరూర్‌లోని మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను గద్వాల వైద్య ఆరోగ్య బృందం-బి సభ్యులు సందర్శించారు. ఈసందర్భంగా వారు జాతీయ నులి పురుగులు నివారణ దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బంగి హుసేనప్ప, డాక్టర్ విజయకాంత(ఆర్‌బీఎస్‌కే, ఎంవో), ఫార్మసిస్టు పరశురామ్, ఏఎన్‌ఎం ఊర్మిళ ఉన్నారు.

చెరువులను తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు

రాజోలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల ప్రభుత్వ పాఠశాలలు చెరువులను తలపిస్తున్నాయని రాజోలి మండల కేవీపీఎస్ కార్యదర్శి విజయ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన రాజోలి, చిన్నధన్వాడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు కురిసిన భారీ వర్షం వల్ల కొత్త రాజోలిలోని ప్రాథమిక పాఠశాలలో వర్షపు నీరు నిలిచి అస్తవ్యస్తంగా మారాయని, అదేవిధంగా చిన్న ధన్వాడ పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచి చెరువువను తలపిస్తున్నాయన్నారు. కొన్ని పాఠశాలలు శిథిలావస్థకు చేరాయని, వర్షం వల్ల తరగతి గదులపై కప్పు కూలే ప్రమాదాలు ఉన్నాయని, ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



కొత్త రాజోలిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు